క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



హసన్‌పర్తి: మండలంలోని వివిధ గ్రామాల్లోని పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. స్వచ్ఛత హీ సేవ- 2024 పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజుతో కలిసి కార్మికులను శాలువతో సత్కరించారు. డీఆర్‌డీఓ నాగపద్మజా, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ కర్ణాకర్‌రెడ్డి, ఏపీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

5న జిల్లా మహాసభ

మడికొండ: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్‌లో అక్టోబర్ 5న మడికొండ కరిష్మా గార్డెన్‌లో బీఎస్‌ఆర్‌కేఎస్ జిల్లా 6వ మహాసభ నిర్వహించనున్నట్లు బీఎస్‌ఆర్‌కేఎస్ జిల్లా కమిటీ సభ్యుడు భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. సభకు సంబంధించిన కరపత్రాన్ని మాజీ కార్పొరేటర్ తొట్లరాజుయాదవ్ మంగళవారం ఆవిష్కరించారు. కాంగ్రెస్ నాయకులు వస్కుల శ్రీను, ఇల్లందుల సంతోష్, భవన నిర్మాణ కార్మిక సంఘం కాజీపేట మండల అధ్యక్షుడు చిక్కుడు సాయిలు, ప్రధాన కార్యదర్శి సల్ల రాజు, ఉపాధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

నేడు ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 25న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, ప్రత్యేక అతిథులుగా సెంట్రల్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ షేక్‌సలీమా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగమణి, గౌరవ అతిథులుగా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి, కేయూ పాలకమండలి సభ్యులు సురేష్‌లాల్, సుదర్శన్, రమ, రాజు, కన్వీనర్‌గా ప్లేస్ మెంటు సెల్ డైరెక్టర్ కిరణ్ పాల్గొంటారని తెలిపారు.

చెట్ల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్..

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ఎలక్ట్రిక్ లో కోషెడ్ ఎదుట కాకతీయ కళాతోరణం చుట్టూ పెరిగిన చెట్లు, చెదారంను రైల్వే అధికారులు తొలగించారు. కళా తోరణం.. 'కళావిహీనం' అనే శీర్షిక ఆగస్టు 1న సాక్షిలో ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. రైల్వే అధికారులు స్పందించి కళాతోరణం చుట్టూ పెరిగిన చెట్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

హసన్‌పర్తి: అన్నాసాగరం ఫీల్డ్ అసిస్టెంట్ శ్యాంసుందర్‌పై గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నాసాగరం ఫీల్డ్ అసిస్టెంట్ తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలను తమ సొంత పనికి ఉపయోగిస్తున్నాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. జాబ్ కార్డులు అడిగితే ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడుతున్నాడని ఫిర్యాదులో వివరించారు.

జయరాజ్‌కు భారతీయ స్ఫూర్తి సేవారత్న అవార్డు

మడికొండ: మడికొండ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జయరాజ్‌కు భారతీయ స్ఫూర్తి సేవారత్న అవార్డును ఈనెల 29న అందజేయనున్నట్లు స్ఫూర్తి ఇంటర్నేషనల్ అవార్డు బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జయరాజ్ గత 16 ఏళ్లుగా చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి ప్యూర్ స్మైల్ చారిటబుల్ ట్రస్ట్ సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ ఈ నెల హైదరాబాద్‌లోని కింగ్ కోటి తిలక్ రోడ్డు గొగ్గలకుంటలోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 25న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. చింతల్, పుప్పాలగుట్ట, ఆదర్శనగర్, మధ్యకోట, తూర్పు, పశ్చిమకోట, శివనగర్, స్తంభంపల్లి ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అభివృద్ధి పేరుతో సమాధుల ధ్వంసం

- సమరయోధులు, మాజీ ఎంపీ, ఎమ్మెల్యేల ఆఖరిమజిలీల కూల్చివేత
- శ్మశానవాటిక వద్ద బంధువుల ఆందోళన
- బాధితులకు అండగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్



హిందూ శ్మశాన వాటికలో జేసీబీలతో నేలమట్టం చేసిన సమాధులు

ఖిలా వరంగల్: వరంగల్ సాకరాశికుంట (ఎస్‌ఆర్ ఆర్‌తోట) హిందూ శ్మశాన వాటికను అభివృద్ధి పేరుతో సమాధులు ధ్వంసం చేశారు. వందల ఏళ్లనాటి శ్మశానవాటికలో పూర్వీకుల సమాధులు నేలమట్టమయ్యాయి. శ్మశానవాటికకు 15 ఎకరాల భూమిని ఆకారపు వీరలక్ష్మి పేరుతో ఆకారపు వంశస్తులు విరాళంగా అందజేశారు. నాటి నుంచి నగరంలోనే అతిపెద్ద శ్మశాన వాటిక, ఆఖరిమజిలీగా గుర్తింపు వచ్చింది. ఇక్కడ అన్ని మతాల వారిని ఖననం చేస్తారు. సుమారు ఐదెకరాల వరకు ఆకారపు వీరలక్ష్మి పేరుతో నిరుపేదల కాలనీ ఏర్పడగా..మిగిలిన 10 ఎకరాల భూమిలో శ్మశాన వాటిక ఉంది. విశాలమైన హిందు శ్మశానవాటికలో స్వాతంత్ర్య సమరయోధులు, దివంగత మాజీ ఎమ్మెల్యే, పార్లమెంట్ సభ్యులు, ఐపీఎస్ అధికారులు, శైవ గురువులు, వేదపండితులు, దళితుల సమాధులు ఉన్నాయి. వారి బంధువులు ప్రతి సంవత్సరం సమాధులను దర్శించుకుని రంగులు వేసి వాటి ఎదుట పితృదేవతలకు నైవేద్యాలను సమర్పించే ఆచారం కొనసాగుతోంది. అయితే మహానగరపాలక సంస్థ అధికారులు ఆదివారం జేసీబీలతో చేరుకున్నారు. బంధువుల సమాచారం లేకుండా వందల ఏళ్లనాటి సమాధులను నేలమట్టం చేశారు. ఈ విషయం తెలిసి మంగళవారం ఉదయాన్నే పెద్ద ఎత్తున పూర్వీకుల సమాధుల బంధువులు శ్మశానవాటిక ప్రాంగణానికి చేరుకుని సమాధులను ధ్వంసం చేసిన జేసీబీలను అడ్డుకున్నారు. బల్దియా అధికారుల తీరుపై మండిపడుతూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న బీజేపీ రాష్ట్ర నేత కుసుమ సతీష్‌తో కలిసి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సందర్శించారు. ధ్వంసమైన సమాధులను వారు పరిశీలించారు. జిల్లాలో మాజీ ఎమ్మెల్యే బండారి నాగభూషణం, సమరయోధుల రాష్ట్ర అధ్యక్షుడు బండారి చంద్రమౌళేశ్వరరావు, మొదటి ఎంపీ ఏటికాల మధుసూదన్‌రావు, రంగ నాయకులు, హనుమంతరావు, తదితర మేధావుల సమాధులు, జ్ఞాపకాలను కూల్చివేయడం బాధాకరమన్నారు. నగరపాలక సంస్థ అధికారుల తీరుపై మండిపడ్డారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా కుట్రపూరితంగా కూల్చివేసినట్లు తెలుస్తుందన్నారు. మున్సిపాలిటీ అధికారుల ఎలాంటి ప్రకటనలు చేయకుండా కూల్చివేతలు చేయడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటిక పరిరక్షణ కోసం బీజేపీ బాధితులకు అండగా ఉండి న్యాయ పోరాటం చేస్తామని గంట రవికుమార్ హామీ ఇచ్చారు. వారివెంట హిందూ హక్కుల పరిరక్షణ సమితి ప్రతి నిధులు, బాధితులు డాక్టర్ బండారి ఉమామహేశ్వర్, ఎస్.శ్రీకంతం, శ్రీనిధిశర్మ, వీరభద్రం, బీహెచ్ జయశంకర్, రాజు ఉన్నారు.



బంధువులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

- జిల్లా సంక్షేమాధికారి రాజమణి



సీమంతం నిర్వహిస్తున్న జిల్లా సంక్షేమాధికారి రాజమణి, సీడీపీఓ తదితరులు

హన్మకొండ: గర్భిణులు సరైన పోషకాహారం తీసుకోవాలని హనుమకొండ జిల్లా సంక్షేమాధికారి రాజమణి అన్నారు. పోషకమాసంలో భాగంగా మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలో హనుమకొండ, కాజీపేట మండలాల్లో పోషణ మేళా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో రాజమణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారంతో పాటు కచ్చితంగా క్యాల్షియం, ఐఎఫ్ఏ మాత్రలు వాడాలని, ఆరోగ్యవంతమైన శిశువుకి జన్మనివ్వాలన్నారు. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాల్లో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తూ లబ్ధిదారులకు పౌష్టికాహారం మీద అవగాహన కల్పించాలన్నారు. వంద శాతం పిల్లలకు బరువులు నమోదు చేయాలన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు ఫుడ్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. కార్యక్రమంలో హనుమకొండ సీడీపీఓ విశ్వజ, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సుమలత, ఈఓ సింధు, డీపీఏ స్వాతి, హనుమకొండ ప్రాజెక్ట్ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవు



కార్డన్‌సెర్చ్‌లో పాల్గొన్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: నేరాలకు పాల్పడే నిందితులపై చర్యలు తప్పవని హన్మకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దీన్‌దయాళ్‌నగర్ కాలనీలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి, వంటి నేరాలకు పాల్పడే నిందితుల సమాచారంను స్టేషన్‌లో ఇవ్వాలని, వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, వాహనాలకు అవసరమైన పత్రాలు లేకుండా రోడ్డుపైకి తీసుకురావద్దని సూచించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని సుమారు 15 వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వై.సతీష్, కేయూ సీఐ సంజీవ్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక రుగ్మతలను రూపుమాపాలి



కేయూ క్యాంపస్ : మాట్లాడుతున్న మల్లారెడ్డి



రామన్నపేట : జెండావిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ అరుణ

కేయూ క్యాంపస్: సామాజిక రుగ్మతలను రూపుమాపాలని, వాటిపై చైతన్యం కల్పించడం జాతీయ సేవాపథకం వలంటీర్లతోనే సాధ్యం అవుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. మంగళవారం కేయూలోని సెనేట్ హాల్‌లో నిర్వహించిన జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావటం ద్వారా వలంటీర్లలో వ్యక్తిత్వ వికాసం పొందుతారన్నారు. క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్‌లాల్ మాట్లాడారు. కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, ఫార్మసీ, కామర్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎన్.ప్రసాద్, అమరవేణి, డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్ మాట్లాడారు.

సామాజిక సేవా దృక్పథంతో ముందుకెళ్లాలి

సామాజిక సేవా దృక్పథంతో ముందుకెళ్లాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను కోరారు. మంగళవారం కళాశాలలో జాతీయ సేవాపథకం ఆవిర్భావ దినోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్ట్స్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్ శ్రీదేవి, చందులాల్, కనకయ్య పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలి

రామన్నపేట : విద్యార్థి దశ నుంచే సేవా భావం అలవర్చుకోవాలని ఎల్బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీ.హెచ్ రావు పేర్కొన్నారు. మంగళవారం ఎల్బీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ డే సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో, ప్రజలను సమాజ సేవ పట్ల చైతన్య పరచడంలోనూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల కృషి వెలకట్టలేదని పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రాఘవేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట ప్రాంత అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

కాజీపేట రూరల్ : కాజీపేట ప్రాంత అభివృద్ధికి, డివిజన్‌లోని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 47వ డివిజన్ భవానీనగర్, బాలాజీనగర్, ఇంపీరియల్ కాలనీలో ఆయన రూ.40 లక్షలతో మంగళవారం రోడ్డు, డ్రైయినేజీ పనులను శంకుస్థాపన చేసి ప్రారంభించారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఇంపీరియల్ కాలనీ ప్రజలు స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీరజాలీ, మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అంకూస్, షేక్ అజ్గర్, మైసారపు సిరిల్, ఇప్ప శ్రీకాంత్, దొంగల కుమార్, చిలువేరు విజయభాస్కర్, బర్లరాజ్‌కుమార్, కొమురవెల్లి రమేష్ పాల్గొన్నారు.

సమస్త జీవకోటికి జలమే జీవనాధారం



పోచమ్మమైదాన్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

దేశాయిపేట : ప్రపంచంలోని సమస్త జీవకోటికి జలమే జీవనాధారం అని నీరు లేనిదే మనుగడ లేదని సీకేఎం కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్.అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం సీకేఎం ప్రభుత్వ కళాశాలలో ప్రపంచ నదుల దినోత్సవం సందర్భంగా ఎన్‌సీసీ విద్యార్థులు 10వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రామదురై ఆదేశాల మేరకు నదుల ఆవశ్యకతను కళాశాల నుంచి పోచమ్మమైదాన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి నీటి ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఒకప్పుడు పుష్కలంగా లభించే మంచినీటిని అభివృద్ధి పేరిట కలుషితం చేస్తున్నామని, అవసరానికి మించి నీటిని వాడుతూ వృథా చేస్తున్నామని అన్నారు. ప్రతి సగటు మనిషి పూలుకొని మానవజాతి మనగడకే కాకుండా అన్ని జీవజాతులకు అతి ప్రాముఖ్యమైనటువంటి నదీ వనరులను వృథా కాకుండా, కలుషితం కాకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ పి.సతీష్‌కుమార్, డాక్టర్ స్రవంతి, హరిబాబు, ప్రకాశం, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎన్‌సీసీ విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలో నదుల దినోత్సవం

వరంగల్ : వరంగల్ ఆరేపల్లిలో వరంగల్ వ్యవసాయ కళాశాలలో వరంగల్ ఎన్‌సీసీ యూనిట్ కంపెనీ 53/10 (టి)బెటాలియన్ కేడెట్స్ ప్రపంచ నదుల దినోత్సవంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ కేడెట్ మేఘన వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.బలరాం, ఏసీసీ అధికారి డాక్టర్ ఎ.శ్రీజన్ క్యాడెట్లను అభినందించారు

రామగుండం అడవిని కాపాడుకుందాం



నిరసన తెలుపుతున్న డీఎస్‌ఏ నాయకులు

విద్యారణ్యపురి: దేశభద్రత పేరుతో ఇండియన్ నేవీ రామగుండం రిజర్వు అడవుల్లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేయటాన్ని వ్యతిరేకిస్తూ డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్‌ఏ)ఆధ్వర్యంలో హనమకొండ అశోకా జంక్షన్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్‌ఏ రాష్ట్ర కో కన్వీనర్లు శ్రవణ్, గణేష్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు జరగకుండా అడవులను కాపాడుకుందాం అన్నారు. దాదాపు మూడువేల ఎకరాల్లో విస్తరించి ఉన్న రామగుండం అడవిలో వన్యప్రాణులు, ఔషధ మొక్కలతో పాటు కొన్ని లక్షల చెట్లు ఉన్న రిజర్వుడ్ ఫారెస్టును నరికివేయాలని యోచించటం శోచనీయమన్నారు. ఆ భూమిలో నేవీ రాడార్‌ను ఏర్పాటు చేయటంతో ఆ ప్రాంతంలో పర్యావరణం దెబ్బతినడమే గాకుండా ఆ అడవిని నమ్ముకొని జీవిస్తున్న వారు ఉపాధిని కూడా కోల్పోతారన్నారు. డీఎస్‌ఏ నాయకులు అనిల్, అభినయ్, శిరీష, చందన, కల్యాణి, జయరాం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పొట్టిశ్రీరాములు పేరునే కొనసాగించాలి

కాజీపేట: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరాములు పేరునే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాజీపేట చౌరస్తాలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. సంఘం అధ్యక్షుడు వెనిశెట్టి రఘు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ బావుసింగ్‌కు వినతిపత్రం అందజేశారు.

గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

విద్యారణ్యపురి: వివిధ గురుకులాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని గురుకుల పాఠశాలల పనివేళలను మార్చాలని టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు మంగళవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యలకు వేర్వేరుగా కలిసి విన్నవించి వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సిహెచ్.రవీందర్‌రాజు, ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, కోశాధికారి కిరణ్‌కుమార్, కార్యదర్శి సీఎస్ఆర్ మల్లిక్ , మాధవి, స్రవంతి పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

కాశిబుగ్గ : అమెరికా పర్యనటలో దేశ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్‌గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బన్న ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి మాదాసు రాజు ఆధ్వర్యంలో కాశిబుగ్గ జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. దయాకర్, జనార్దన్, వీరస్వామి, సదానందం, రవి, అనిత పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి

హసన్‌పర్తి : ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఉచిత హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ప్రతిమ రిలీఫ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ హెల్త్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకట్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, పాల్గొన్నారు.

ఆస్పత్రి సేవలపై అవగాహన అవసరం

ఎంజీఎం : యువతకు ఆస్పత్రి సేవలపై అవగాహన అవసరమని మై భారత్ ఎన్‌వైకే జిల్లా యూత్ అధికారి చింతల అన్వేష్ పేర్కొన్నారు. మంగళవారం ఎంజీఎం ఆస్పత్రిలో సేవ సే సీఖేన్-2024 కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని భారత యువజన వ్యవహారాల శాఖ, క్రీడ మంత్రిత్వ శాఖ యువజన వ్యవహారాల విభాగం మేరా యువభారత్ సంస్థ నిర్వహిస్తోంది. కార్యక్రమానికి ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళీ, ఎండీ అనస్తీషియాలజీ సిహెచ్.మురళీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం కోసం మై భారత్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 12 మంది అభ్యర్థులలో చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీకి చెందిన ఐదుగురు మంది విద్యార్థులు ఎంపిక చేయబడ్డారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత వీరికి ధ్రువపత్రాలు అందజేయబడుతాయని తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

ఖిలా వరంగల్ : కబ్జాల పాలవుతున్న ప్రభుత్వ భూములను పరిరక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఏలేందర్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ఇళ్లు కట్టుకున్న పేదల భూములకు పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలని జీఓ 58 ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులకు అండగా ఉంటా

నయీంనగర్: వర్కింగ్ జర్నలిస్టులకు అండగా ఉండి, వారి కుటుంబాలకు సాయం చేసేందుకు ఎల్లప్పుడు ముందుంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇటీవల డెస్క్ జర్నలిస్ట్ కర్ణకంటి రామకృష్ణాచారి గుండెకు కంతి ఏర్పడి నిమ్స్ హాస్పిటల్‌లో ఓపెన్‌హార్ట్ సర్జరీ చేసి కంతిని తొలగించారు. రామకృష్ణాచారి ఆర్థికపరిస్థితి, వైద్య ఖర్చుల వివరాలను గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. 1.50 లక్షలు మంజూరు చేయించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షులు దుర్గాప్రసాద్, అల్లం రాజేశ్వర్లు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీని సన్మానించిన టీజీఓ నాయకులు

హన్మకొండ అర్బన్ : తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ ఆఫీసర్స్, టీచర్స్, వర్కర్స్, పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో జరిగిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ సన్మాన సభలో ఆయనను ఉమ్మడి వరంగల్ జిల్లా టీజీఓ నాయకులు శాలువాతో సత్కరించి పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ జగన్‌మోహన్‌రావు, జనగాం జిల్లా అధ్యక్షుడు అమ్జద్ అలీ, హనుమకొండ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.

ఉత్సవాలకు శాశ్వత స్థలం కేటాయించాలి

కాశిబుగ్గ : వరంగల్ కాశిబుగ్గలో దసరా ఉత్సవాలకు శాశ్వత స్థలం కేటాయించాలని కాంగ్రెస్ 19వ డివిజన్ అధ్యక్షుడు దాసరి రాజేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూచన రవీందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం మంత్రి కొండా సురేఖను కలిసి వినతి పత్రం అందజేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఖిలా వరంగల్: సఖి సెంటర్ సేవలపై మహిళల హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సఖి సెంటర్ నిర్వాహకురాలు స్వప్న సూచించారు. మంగళవారం వరంగల్ రైల్వేగేట్ పెరకవాడలో సఖి సెంటర్ నిర్వాహకుల ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్యవసర సమయంలో మహిళలు హెల్ప్‌లైన్ 181 డయల్ చేసినట్లు అయితే కాపాడటం జరుగుతుందని వివరించారు. సునిత, ఆర్పీలు పాల్గొన్నారు.

బీజేపీ కుటుంబంలో భాగస్వాములు కావాలి



హన్మకొండ: దేశ భవిష్యత్ కోసం బీజేపీ కుటుంబంలో భాగస్వాములు కావాలని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని హంటర్‌రోడ్ ప్రాంతంలో ఆమె పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటోవాలాలను, వ్యాపారులు, పౌరులను కలిసి పార్టీ సభ్యత్వం చేయించారు. సత్యనారాయణ, పాల్గొన్నారు.

రావు పద్మను కలిసిన ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను జిల్లా ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ కార్యవర్గం కలిసింది. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ రైల్వే పెరకవాడలో బీజేపీ సీనియర్ నాయకుడు ముత్తినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ ఆన్‌లైన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ముద్దసాని కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు

వరంగల్ : తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసే దిశగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ తూర్పులోని 12వ డివిజన్‌లో పలు కాలనీల్లో పర్యటించి సభ్యత్వాలను ఆయన అందజేశారు. బీజేపీ జిల్లా నాయకులు వెంకట్ గౌడ్, మురళీకృష్ణ, మహేష్, శిల్ప, పాల్గొన్నారు.

చంద్రక్క ఆశయాలను కొనసాగిద్దాం

ఖిలా వరంగల్: చంద్రక్క, ముక్తార్‌పాషాల ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత గుంగుల దయాకర్, మానవహక్కుల వేదిక జిల్లా నేత బండి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం పడమరకోటలో అమరవీరుల స్తూపం వద్ద సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు ఆధ్వర్యంలో చంద్రక్క, ముక్తార్‌పాషాల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. నలిగంటి విజయపాల్, సాంబయ్య, కృష్ణ, ప్రభాకర్, రాజేందర్, రాజు, పాణి, ఎండి అక్బర్, నారాయణ, రాజు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల శ్రమదానం

హన్మకొండ కల్చరల్ : శ్రీభద్రకాళి దేవాలయంలో మంగళవారం ఎల్‌బీ కళాశాలకు చెందిన ఏన్‌సీసీ విద్యార్థులు దేవాలయ ప్రాంగణంలో శ్రమదానం నిర్వహించారు. ఇందులో భాగంగా దేవాలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శేషుభారతి పాల్గొన్నారు.

చెస్‌లో 'మాస్టర్‌జీ' విద్యార్థిని గెలుపు

నయీంనగర్: హనుమకొండ కిషన్‌పుర మాస్టర్ జీ స్కూల్ విద్యార్థిని పి.లక్ష్మీ శార్వాణి కన్నా చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ -15 బాలికల విభాగంలో రెండోస్థానం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికైందని ఏఓ చత్రపాల్ సింగ్ తెలిపారు.విద్యార్థినిని ప్రిన్సిపాల్ అభినందించారు.

యువనాయకుడికి పోలీస్ అధికారి స్వాగతం

వరంగల్ అర్బన్ : అతను ఒక అధికార పార్టీ యువ నాయకుడు. ఎలాంటి పదవిలో లేడు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం జరుగుతోంది. యువనాయకుడు తన వాహనంలో బల్దియా కార్యాలయానికి చేరుకున్నాడు. యువకులతో కలిసి వస్తుండటంతో ఓ పోలీస్ అధికారి ఆ యువనాయకుడికి స్వాగతం పలుకుతూ ఆహ్వానించారు. కొద్దిసేపు కార్యాలయం ఆవరణలో అనుచరవర్గంతో ముచ్చటించారు. అనంతరం తిరుగు ముఖంలో కూడా సదరు పోలీస్ అధికారి వీడ్కోలు పలకడం చర్చనీయాంశంగా మారింది. విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టిస్తోంది.

ఔట్ సోర్సింగ్ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

వరంగల్ అర్బన్ : బల్దియా ఔట్ సోర్సింగ్ డ్రైవర్ ప్రధాన కార్యాలయం ఆవరణలో మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మేయర్ వాహన డ్రైవర్‌గా బుద్ద నాగజగన్ మూడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాడు. అనారోగ్యం కారణంగా కొద్దిరోజులుగా విధులకు హాజరుకాకపోవడంతో అతడి స్థానంలో మరో డ్రైవర్‌ను నియమించారు. ఆరోగ్యం కుదుటపడడంతో మేయర్ వాహనం వద్దకు వెళ్లడంతో బల్దియాకు సంబంధించిన ఇతర వాహనాన్ని నడపాలని సూచించారు. కొద్ది రోజులుగా డీఆర్‌ఎఫ్ వాహనాన్ని నడిపాడు. అక్కడి నుంచి చెత్తవాహనాన్ని నడిపించాలని మేయర్ ప్రజారోగ్యం అధికారి ఆదేశించారు. దీంతో మానసిక వేదనకు గురైన జగన్ మేయర్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో వచ్చి తాగేందుకు యత్నించగా, పక్కన ఉన్న తన మిత్రులు వారించి, డబ్బాను లాక్కున్నారు. విషయం తెలుసుకున్న మేయర్ గుండు సుధారాణి పిలిపించుకొని న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మేయర్ వాహన డ్రైవర్‌గా, డీఆర్‌ఎఫ్ వెహికిల్ డ్రైవర్‌గా తొలగింపునకు మేయర్ సీసీ కారణమని తనపై ప్రతీకారం తీర్చుకుంటున్నాడని జగన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హంటర్‌రోడ్డులో మంగళవారం పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిందితుల నుంచి రూ.12850 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రామన్నపేటకు చెందిన గుండా పృథ్వీరాజ్, వరంగంటి రఘు, వరంగల్ శాంతినగర్‌కు చెందిన సరస్వతి గిరి, హంటర్‌రోడ్డుకు చెందిన మాడమనేని కాశేశ్వర్‌రావులను అదుపులోకి తీసుకోని సుబేదారి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. సీఐ రాజు, ఆర్ఎస్సై భానుప్రకాశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మామునూరు : బంధువుల దశదిన కర్మకు హాజరై చెరువులో దిగి స్నానం చేస్తూ గుండెపోటుకు గురైన ఓ వ్యక్తి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఖిలావరంగల్ మండలం బొల్లికుంటకు చెందిన సుతారి రాధమ్మ పదిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె దశదిన కార్యక్రమంలో మంగళవారం ఉదయాన్నే స్నానానికి బంధువులతో కలిసి సుతారి రమణాచారి(65) బొల్లికుంట ఊర చెరువు వద్ద స్నానానికి వెళ్లాడు. చెరువులోకి దిగిన రమణాచారి ఆకస్మాత్తుగా గుండెపోటుకు గురికాగా బంధువుల అతన్ని వెంటనే 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.